# వేశ్య జీవితం

## ఆర్. యస్. కె. మూర్తి

ఆమె వృత్తి చేసుకునే వేశ్య. సంఘసంస్కరణను వంటికి పూసుకున్నవాళ్ళు అనేక కంపళ్ళుప్పవల్ల ఆమె మనస్సును చంపుకొన్నదంటారు. నీతి, నియమాలకు ప్రస్తీలమనుకునే వాప ఆమె కసలు మనసనేదే లేదని అందుకే నీతిని తప్పినదనీ అంటారు.

"కాని వాళ్ళు, వీళ్ళుకూడా కాదనలేనిసత్యం ఆమెకో శరీరముందని, ఆ శరీరం కష్టసుఖాలు వచ్చి నిజాలని. మనసును చంపుకున్నా మనసనేదే లేక నీతిని మాపుకున్నా. అది ఆ శరీరం కోసమే అయివుండాలి కదా? అయితే ఆ శరీరానికి సుఖమనేదే లభించకపోయినా, ఆమె ఆ వృత్తిని చేస్తున్నదంటే ఎందుకలా చేస్తున్నదో వీరు, వారు కూడా చెప్పలేరు.

"కాకపోతే_ శరీర సౌఖ్యంకోసం వృత్తిలోకి దిగింది. వృత్తి చేస్తున్నది కాబట్టి శారీరకంగా సుఖపడుతూనే ఉన్నదని వీకో. వాఁ వాదించవచ్చు డిడెక్టివు లాజిక్. మా లాజికు లెక్చరరు గోలపెట్టి చెబుతుండేవాడు. "మానవుడు మరణిస్తాడు. సోక్రటీసు మానవుడు. కాబట్టి సోక్రటీసు మరణిస్తాడు." చచ్చిన సోక్రటీసునిగురించి ఎందుకొచ్చిన లాజికు చెప్పండి. ఆమె సుఖపడటం లేదని ఖచ్చితంగా తెలుస్తూనే వుంటే, ఆమె విషయంలో మాత్రం మనకు లాజికు ఎందుకు?

"కాకపోతే, యిది సుఖమేమో మీరేచెప్పండి. సాయంత్రం చీరె సింగారించుకుంటే ఎప్పటికి విశ్రాంతి లభించేనో? తాను వయసులో చిన్నది. అందంలో వన్నెకలది. ఇక తనకెక్కడి విశ్రాంతి? శరీరం అలసి. సొలసి వున్న సమయంలో వస్తాడో ప్రియుడు. అతని కది ఎదురు చూచిన క్షణం. ఆమెకో? కాని తప్పదు. చెదిరిన పౌడరుని దిద్దుకోవాలి. నలిగిన పెదవులపైకి చిరునవ్వును తెచ్చుకోవాలి. అలసిన శరీరాన్ని నిద్రలే



పాలి. ఇదంతా ఆమె సుఖపడటమే నంటారా? అయితే శరీర సౌఖ్యం కోసం ప్రారంభించిన వృత్తిని, శరీరాన్ని కష్టపెట్టుకునికూడా ఎందుకు చేస్తున్నది? ఆమెకు మనస్సులేదు కాబట్టి, లేదా ఈ ప్రశ్న వేసుకోలేదు కాబట్టి నంటారా: కావచ్చు. ఈమె జీవిత సమస్యను ఒక సమస్యను చేయటం నా కిష్టం లేదు."

\+ \+ \+

కథను చదువుతున్న వెంకట్రావు కాగితాల నక్కడపెట్టి. "జస్ట్ ఏ మినిట్" అంటూ బయటి కెళ్ళాడు- బహుశా సిగరెట్ల కోసమనుకుంటాను.

కథను వింటున్న నేను, విన్నదానికే కాస్తంత కంగారుపడ్డాను. వేశ్య విషయాన్నొక సమస్యను చేయటం యిష్టం లేదట: వెంకట్రావుకి. నిజమే, నాకూ యిష్టం లేదు. ఎందుకనంటే అప్పట్లో నాకున్న సమస్యలు వేరు, కొన్ని నిమిషాలకు ముందు నన్ను వేధించిన సమస్య వెంకట్రావు కథల నెందుకు వ్రాస్తున్నాడూ అని. ఈ క్షణంలో నా కర్థంకాని సమస్య వెంకట్రావు ఈ వేశ్య కథ నెందుకు వ్రాశాడూ అని.

అలా అని వెంకట్రావు కథలు వ్రాయకూడదని గాని, వేశ్యల బ్రతుకులు కథా వస్తువుగా పనికిరావనిగాని నా ఉద్దేశ్యంకాదు, అహ నా ఉద్దేశ్యమేమిటో మీకు అర్థంకావాలంటే, వెంకట్రావుని గురించి మీకు మరికొంత చెప్పక తప్పేటట్లు లేదు.

వెంకట్రావు కష్టజీవి. వృత్తిచేత లాయరు. మంచి ప్రాక్టీసున్న వాడు. అతనో ప్రేమజీవి. అన్నలు. తమ్ముళ్ళు, అప్పలు, చెల్లెళ్ళు- అందరిని ఆదరంగా చూచే స్వభావం కలవాడు. రెండు చేతులా సంపాదించే అతని సంపాదన దేనికీ ఆటిరావటం లేదంటే కారణం అతని అనురాగ మనస్కతే. అతనిది పోస్టాఫీసు సంపాదన. బండెడు ఉత్తరాలు. సార్టుచేస్తే సంచీకి రెండురావు అయితే అతనందుకు ఏనాడూ విచారపడలేదు. "జీవితాన్ని ప్రారంభిస్తున్న వాడివి, ఎందుకోయి. అలా వెనుకా ముందూ చూసుకోకుండా ఖర్చుపెడతావు?" అని మేమెవరిన్నా మందలించ బోతే "ఎవరికి ఖర్చు పెడుతున్నా నంటావు? నా వారికేగా," అని తృప్తిగా నవ్వేవాడు. పోనీ ఆ తృప్తి అయినా అతనికి లభించినందుకు మేమూ సంతోషించే వాళ్ళం.

అయితే అతనికీమధ్య ఆ తృప్తీ కొరవడిందని వింటున్నాను, అతనిదివరలా తన వారిని ఆదుకోలేకపోతున్నాడని, దానిపై వారు అతను చేసిన దానిని మరచి, చేయని దానిని ఎత్తి చూపుతూ, అతని హృదయాన్ని గాయపరుస్తున్నారనీ వింటున్నాను.

బహుశా అతనందుకే ఈవేశ్యకథను వ్రాశాడేమో? శరీరాన్ని హింసించుకొనికూడా తన ఆదరాన్ని పొందలేని వెంకట్రావు, శరీరాన్ని జీవితాన్ని, చిత్రహింస పెట్టుకునికూడా, ప్రపంచపు ఆదరణకు నోచుకోని వేశ్యల జీవితంనుంచి ఓదార్పును పొంద ప్రయత్నిస్తున్నాడేమో? ఈవేశ్య జీవితంలోనుంచి తనజీవితంలోకి అతను తొంగి చూసుకుంటున్నాడేమో?

* * *

సిగరెట్టు కాల్చుకుంటూ వచ్చిన వెంకట్రావు నాకూ ఒకటిచ్చి, కథ చదవటానికి ఉపక్రమించాడు.

"నైవేద్యంలేకుండా, ఉత్త ధూపంతోనే సరిపుచ్చి కథను వినిపిస్తున్నావోయి. నీ కథకు సరస్వతీ బుట్టశాపం తగిల తీరుతుంది, అని అతనితో మేలమాడ- బోయాను.

కాని అతను నిర్వికారంగా కథలో మునిగిపోయాడు. "_ఈమె జీవిత సమస్యను ఒక సమస్యను చేయటం నాకిష్టంలేదు.

"ఎందుకంటే నా కథకీమె నాయకురాలుకాదు. నా కథకసలు నాయికేలేదు. కాని నాయికి లేని కథమీరు చదవరని డమ్మీతో మొదలుపెట్టాను డమ్మీ అంటే...పూర్తిగా డమ్మీకూడా కాదనుకోండి.

"ఆనందరావునాకథకు నాయకుడు. అతనప్పుడే వృద్ధిలోకి వస్తున్న డాక్టరు, సిన్సియారిటీ, తెలివి తేటలు, హస్తవాసి కలవాడుగా పేరు పడ్డాడు. అందుకే అతని వద్దకు వచ్చే పేషెంట్ల సంఖ్య చాల ఎక్కువ. ప్రొద్దునుంచి రాత్రివరకు ఎవరో ఒకరు వస్తూనే వుంటారు.

"ఎవరి విషయంలో వారికి ఆతురత. ఆనందరావుకది కిల్లింగు రొటీను. అలసిన శరీరం విశ్రాంతిని కోరుతుంటే, క్లాంతమైన మనస్సు ఎదురు తిరుగుతూ ఉంటే, అతను పేషెంట్ల సొదను వినాలి. నిద్ర తూగుతూన్న కళ్ళలో కాంతులను ఒలికించాలి. అలసిపోయిన మనస్సుతోనే పేషెంట్లను ఉత్సాహపరచాలి. రేపు, మాపు రమ్మనటానికి వీలులేదు కదా? ఆ వచ్చి వాయనకు అది ఒక్కటే పని, కాని డాక్టరుకి?

"నామటుకు నాకు ఈ డాక్టరుగారి జీవితం లోంచి, 'ఆమె' జీవితం తొంగిచూస్తూ కనిపిస్తుంది. ఆమెకు మనస్సు లేదన్నాం. మరి మనసున్న ఈయనిలా ఎందుకు తనను తాను హింసించుకుంటున్నాడు? కొంతమంది పేషెంట్లని మరొక డాక్టరు దగ్గరికి పంపరాదూ? ఈయనకూడా ఇలా శరీరాన్ని మనస్సును ఎందుకు బానిసలు చేస్తున్నాడంటారు? పేరు, ప్రఖ్యాతుల కొసరమా? కాదు, అవసరాన్నిబట్టే అని నేనంటే మీరు ఖస్సుమనవచ్చు. భౌతికావసరాల కోసరం ఆనందరావులాంటి వ్యక్తి మనస్సును చంపుకుంటాట్టయ్యా, అని మీరు నన్ను గదమాయించవచ్చు.

"అయితే, ఆనందరావులాంటి' అనటానికి అతనెలాటివాడో నేను మీకు చెప్పలెదు కదా? విజానికి చెప్పటానికి మాత్రమే మున్నది? 'ఆనందరావులాంటి' అనేటప్పటికి అతనో ప్రత్యేక వ్యక్తిగా భావిస్తున్నారే తప్ప, నిజానికి తను ప్రత్యేక వ్యక్తేమీ కాదు. అతనో సామాన్యుడు. అది నిజం. డాక్టరు అనందరావు బాగా సంపాదన కలవాడే. కాని మారుతూవున్న ఆర్థిక వ్యవస్థనే సాలెగూటిలో అతనొక చిన్నపురుగు.

"అతనికొచ్చే ఉత్తరాలలోకొన్ని :

"అన్నయ్యకు, నమస్కారములు. నీవు చూపిన ఆదరణకు కృతజ్ఞుడను. నీ సహాయము వలన ఒక జీవిత మార్గాన్ని చూచుకోగలిగాను. మొన్ననే మీ మరదల్ని తీసుకువచ్చాను. కొత్త సంసారం. ఎలా సర్దుకోవాలో తెలియటంలేదు. ఈ నెలలో నీవొక...రూపాయలు, నాకు జీతం వచ్చేనాటికి, పంపగోర్తాను, ఏదో వ్రాసినానని అశ్రద్ధ చేయవద్దు."

"ఏదో వ్రాశాడని అశ్రద్ధ చేయటమెలా? తమ్ముడు నాలుగు రాళ్ళు తెచ్చుకుంటూ. తన శ్రమను ఫలింప జేశాడు. ఇప్పుడు వాడు క్రొత్త కాపురం దిద్దుకో గలందులకై తన సహాయ మర్థిస్తుంటే, కాదనటమెలా? అవు ననటం మాత్ర మెలా? వాడికిది మొదటిసారి. తనకిది మొదటి అబ్లిగేషను కాదు కదా?

"అన్నయ్యగారికి, నమస్కారములు. నీవు పంపిన డబ్బు చేరినది. హాస్టలుబిల్లు చెల్లించాను మాకు రేపు 27 నుండి టూరు ప్రోగ్రామున్నది. అందువల్ల మరొక _ రు. లు ఈ ఉత్తరం చూచిన వెంటనే పంప ప్రార్థన. నీవు చూపుతున్న ప్రేమాదరణలకు కృతజ్ఞుడను. ఆలస్యము చేయక వెంటనే డబ్బు పంపప్రార్థన."

"ఆలస్యము చేయటమెట్లా? అవతల టూరు ప్రోగ్రామాయె? ఈ తమ్ముడు కాస్త చదువులో పైకి వస్తున్నాడని ప్రొఫెషనలు కాలేజీలో చేర్పించాడు. రెక్కల మీద ఆధారపడేవాడు చదివించే చదువులా యివి? పాడు భారతంలో అన్నీ కరవే. సీతి, నిజాయితీల దగ్గరనుంచి. త్రాగేనీళ్ళవరకు అన్నీ ప్రియమే. తన తమ్ముడిది అర్జంటు విషయం. తాను తీర్చక తప్పదు. ప్రియుడు కోరికిన పెదవి నొప్పిపుడుతున్నా. సరసుడు గిల్లినబుగ్గ మంట పెడుతున్నా.—

"చిరంజీవి ఆనందుకు, అక్కయ్య ఆశీర్వదించి వ్రాయునది ... అమ్మను పంపుతూ, అమ్మతోపాటు ... రూపాయలు పంపించేది. అత్యవసర పరిస్థితులలో నిన్నీ సహాయ మడుగుతున్నానని గ్రహించగలవు."

"నిజమే. అత్యవసర పరిస్థితే. లేకపోతే తన అక్క తనదగ్గర చేయిజాచదు. బావ అదో రకం మనిషి. బాధ్యతలు తెలియవు. ఇలాంటి అవసరం వచ్చినప్పుడు ఆదుకోకపోతే ఎట్లా? కాని ఆదుకోవటం మాత్రమెట్లా? అక్క అయితే అది చాలారోజుల తర్వాత అడిగిన రిక్వెస్టు. తనకలాంటివి క్రొత్తకాదే. తానేదో సంపాదిస్తున్నానని తన సహాయ మడుగుతారు. అడగ తగ్గవారే వారు. తనవారే అందరు, కాని తనది పోస్టాఫీసు సంపాదన. బండెడు ఉత్తరాలు ప్రోగవుతై. సార్టుచేసివేస్తే సంచీకి రెండురావు, ఇది ఆనందరావు స్థితి."

*

మరో సిగరెట్టు ముట్టించుకోవటానికి చదవటం ఆపాడు వెంకట్రావు.

ఓహో, యిదా వెంకట్రావు పరిస్థితి: అను

కుంటూ అతనిచ్చిన సిగరెట్టు అందుకున్నాను. మారుతున్న ఆర్థిక వ్యవస్థలో అన్న, దమ్ముల మధ్యనే అసమానత లేర్పడతై. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలలో అది సహజ పరిణామమే. కాని అదిమనుషుల మనస్సులలో, మమతలలో యిలాంటి పరిణామాన్ని తీసుకొస్తుంది కాబోలు.

వెంకట్రావు మరల ఉపక్రమించాడు.

"ఇదీ ఆనందరావు స్థితి. అందుకే "ఆమె" పూర్తిగా డమ్మీ కాదన్నాను. ఆనందరావు జీవితంలోనుంచి ఆమె జీవితం తొంగి చూస్తూ వుంటుంది. ఏమిటిట తేడా? ఆమెకు మనస్సు లేదు. లేదా మనస్సును చంపుకొన్నది. ఆనందరావుకి మనస్సున్నది. మనస్సున్న మానవుడిగా మసలుకోవాలనే తాపత్రయమున్నది. కాని పరిస్థితులు తనను విలవిలలాడించటంలా, బాధ్యతలు తనను ఛాలెంజి చేస్తున్నాయి. అందుకే ఇంకా శ్రమపడుతున్నాడు. లేని ఉత్సాహాన్ని తెచ్చుకుంటున్నాడు. కాని శరీరం ఎదురు తిరుగుతున్నది. దాన్ని లొంగదీయడమెలా? మనస్సును చంపుకోవచ్చునేమో? మమతలు మాపుకోవచ్చునేమో? సొమ్మసిలిన శరీరం చేత పని చేయించటమెలా? కాడి పారవేసి కూలబడిన మున్సిపాలిటీ బండి ఎద్దు అది!"

* * *

కాగితాలు సర్దుకుంటున్నాడు వెంకట్రావు. అతని వేదన నా కర్థమైంది, శరీరాన్నిహింసించుకోలేక ఒకింత విశ్రాంతిని కోరుకుంటే తనవాళ్ళే తనకు అవకాశమివ్వటం లేదన్నమాట. వేశ్యా జీవితమే మరి!

"అదేమిటోయి, కథనలా అర్థాంతరంగా ముగించావు? ఆ వేశ్యనేమిటలా మొదట్లోనే వదిలేశావు?" అనడిగాను.

"లేదోయి రామం. యీ రెంటినీ ఎలా కలపాలో తెలియకనే, ఈ కథ నీకు చదివి వినిపించాను. దీనికి ముగింపు నీవే చెప్పాలి" అంటూ కుర్చీలోకి జారాడు.

చిక్కు ప్రశ్నే. అతని కథకు నేనేమని ముగింపు చెప్పగలను ?

"లేదు, వెంకట్రావు, నేనీ కథకు ముగింపు సూచించ లేను."

అన్నానే కాని, వెంకట్రావు కథ నన్ను వెంటాడుతూనే ఉంది. దానికి ముగింపు నేనిలా చెప్పగలి గాను కూడ.

\+ \+ \+

"ఆ రాత్రి "ఆమె"కు శివరాత్రి, శరీరం దస్సిపోయింది, ముట్టుకున్న ప్రతిశరీర భాగమూ ఖస్సుమంటుంది, కారిడరు కుర్చీలో వాలిపోయిన ఆమెకు తన యింటి, వేపే వస్తున్న డాక్టరు ఆనందరావు కనిపించాడు. ఇదేమిటి? ఈ యనిటు వస్తున్నారు. డాక్టరు ఆనందరావుని తానెరుగును. ఆ వ్యక్తిని గురించి చాల, చాల తాను విన్నది. విన్నదంతా ఆయన మంచిని గురించే. అలాంటాయన యిటు వస్తున్నారేమిటి? తన యింటికే వస్తున్నట్లు న్నాదే? అయ్యో, ఇవ్వాళే రావాలా?

"ఇవ్వాళ తానో నిశ్చయానికి వచ్చింది. శరీరాన్ని తా నిక హింసించలేదు, "కాదు" అనటం నేర్చుకోవాలి, ఇవ్వాళే తన నిర్ణయాన్ని ఆచరణలోకి తీసుకురావాలి, అది డాక్టరుగారి దగ్గరే కావాలా? నిశ్చయం నీరు కారబోదు కదా?

"ఆ భూతల స్వర్గంలో అడుగు పెట్టటం ఆనందరావు కదే మొదటిసారి ఆడిట్సులో వదిలి పెట్టబడిన పల్లెటూరివానిలా ఫీలవుతున్నాడు. ఏదో మాట్లాడాడు. లక్ష్మీదేవి తన చంచలతను ఋజువు చేసుకున్నది. తానీ గదిలో ఉన్నాడు. ఈమెనెక్కడో చూచినట్లున్నదే? అదేమిటలా చలనం లేకుండా పడి ఉన్నది? ఉత్సాహం చూపుతూ, ఎదురు వస్తారని చెబుతారు కదా?

"క్షమించాలి. ఇవ్వాళ బాగా అలసిపోయాను. అంతగా అవసర మనుకుంటే...త్వరగా వెళ్ళిపోవాలి. లేక మరొక రోజున రాగలిగితే, అదృష్టవంతురాల్ని" నీరు గారిన నిశ్చయం పలికిన మాటలు.

"ఏమిటీ, నీకూ అలసటగా ఉందా?" ఆనందరావు అనుమానం.

"నీకూ అంటే, నేనేమీ మనిషిని కాదనా? మనస్సు లేకపోవచ్చు. కాని శరీరం, దాని కష్ట సుఖాలు దానికున్నవి కదా?"

"నో. నో. నా ఉద్దేశ్యం అదికాదు. అలసిన శరీరంతో. విసిగిన మనస్సుతోనే నే నిక్కడకు వచ్చాను. నీవూ అలసి ఉన్నాననటం విచిత్రంగా విన్పించింది."

"ఈ మాట లంటున్న డాక్టరు గారిలో ఆమెకు "ప్రియుడు" కనిపించలేదు. మనస్సు లేదంటారేం తనకు? ఇప్పుడు తన శరీరాన్ని లొంగదీసింది తని మనస్సే కదా? దగ్గరకుచేరి లాలించింది, డాక్టరుగారిని.

"మీరు అలసిపోవటమేమిటి!" అని బుజ్జగించింది

"ఈ ప్రశ్న ఆనందరావుకి క్రొత్తేమీకాదు. కాని దాని వెనుకనున్న ఆప్యాయత క్రొత్త. మీరు అలసిపోవట మేమిటి, డాక్టరు......అని నవ్వే పేషెంట్లు. నువ్వు అలసిపోవట మేమిట్రా పిచ్చి సన్నాసీ...అని నవ్వుకునె బలగం. అట్లా అలసట, అలసట అని గోల పెట్టకపోతే కాస్త పని తగ్గించుకోరాదూ, అని కోపగించుకొనే షట్కర్మచారిణి – విశ్వవరి ఓదార్పులోను లేని మానవత్వం ఆమె మాటలలో కన్పించింది. ఆనందరావుకి.

"తోటి బాధితురాలుగా ఆమె అతని బాధను తీర్చగలిగింది. పడిపోయినా పతితుడు కాని ఆనందరావు కాయిల్లు నరకంలా లేదు. దేవత లున్నచోటును నరకం అనరుకదామరి

"ఆనందరావులో వచ్చినమార్పుకు అందరూ ఆశ్చర్యపోతున్నారు. "లేదు" అనటం తాను నేర్చుకోడు–తనవారి విషయంలోకాని. ఉన్నంతవరకు మాత్రమే సహాయంచేస్తాడు. తనకున్నది తనవాళ్ళతో పంచుకుంటాడే తప్ప, కర్ణుడులాగా కవచకుండలాలను కోసియివ్వడు.మారుతూవున్న ఆర్థికవ్యవస్థ తన అవస్థకు కారణమన్న ఆమె వ్యాఖ్యానం ఎంత సబబుగా ఉన్నదో! వర్గానికి, వర్గానికీ మధ్యమాత్రమేకాక, మనిషికీ, మనిషికి మధ్య, అన్నకూ తమ్మునికీమధ్య, అసమానతల్ని సృష్టిస్తున్నదీ ఆర్థికవ్యవస్థ, ఊబిలో కూరుకుపోకుండా ఉండాలంటే, దానిమీదుగా తేలికగా పరిగెత్తుకు పోవటమొక్కటే మార్గం.

"విలువలు అస్తవ్యస్తంగా వున్న నేటి సమాజంలో అంతకంటె మెరుగైన జీవితాన్ని గడపలేడు ఆనందరావు.

"గడపలేరు ఆనందరావులు".

ఆనందరావు కథనలా ముగించాను, నేను.

వెంకట్రావు కథకీ ముగింపును సూచించాను. నే ను. తరువాత ఒకరోజున వెంకట్రావుకి ముగింపు చదివి వినిపించాను.

"బాగానె ఉన్నదికాని, రామం, ఆనందరావు వేశ్యయింటికి వెళ్తాడంటావా?" అని ప్రశ్నించాడు.

నేనా ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

కాని "వెంకట్రావులు"– పోనీ ఆనందరావులే అనండి– వేశ్యల యింటికి వెళ్ళాలి. శరీరాన్ని హింసించుకొని, వేశ్యా జీవితాన్ని గడిపే ఆనందరావులు, ఆ వేశ్యలెలా జీవిస్తున్నారో చూస్తేతప్ప, తమ జీవితాన్ని జీవించటానికి అవసరమైన కాలొరీలను వారు తయారు చేసుకోలేరు. సమాజంలో అట్టడుగున ఉన్నవారి జీవితాన్ని చూస్తేతప్ప, ఈ జీవిత మహాసర్పంతో పోరాడే ధైర్యాన్ని కూడదీసుకోలేరు. మధ్య తరగతి ఆనందరావులు. అందుకే ఆనందరావు ఆ వేశ్య యింటికి వెళ్ళాలి.

కాని వెంకట్రావుతో నేనీ విషయాలేమీ చెప్పలేదు. ఊరకే అతన్ని వెక్కిరించాను.

"వేశ్య యింటికి వెళ్ళట మంటేనే భయపడే నీకు, ఈ వేశ్య జీవితాన్నుంచి తప్పించుకోవా అనే తాపత్రయ మెందుకోయి ?' అని అతన్ని గేలిచేశాను.

నిర్వికారంగా జూస్తూ కూర్చుండిపోయాడు. వెంకట్రావు. ●

